నవతెలంగాణ
1
మెదక్
బుధవారం | 28 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

సబ్బు బిళ్ళలపై ఆజాద్ చిత్రం



నవతెలంగాణ-గజ్వేల్

భరతమాత ముద్దుబిడ్డ ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆ విప్లవ వీరుని చిత్రాన్ని సబ్బుబిళ్ల మీద అద్భుతంగా చిత్రించి ఘన నివాళులు అర్పించారు. మంగళవారం గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆజాద్ చిత్రాన్ని సబ్బు బిళ్లపై చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నీ పేరేంటి అని అడిగితే ఆజాద్ అని, నీ తండ్రి పెరడిగితే స్వాతంత్రం అని, మీ ఇల్లెక్కడ అని అడిగితే జైలు' అని సగర్వంగా చెప్పిన విప్లవ వీరుడు ఆజాద్ అని తెలిపారు. స్వరాజ్య స్వేచ్ఛతో 15 ఏండ్ల వయసులోనే స్వతంత్ర సంగ్రామంలో అడుగిడిన మహా వీరుడు ఆజాద్.. 24 ఏండ్లలోనే దేశం కోసం అమరుడయ్యాడని గుర్తుచేశారు. ఇలాంటి అమరవీరుడు భారతీయ యువత త్యాగాలకు ప్రతి రూపమన్నారు.

మహిళలకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ దరఖాస్తులు

నవతెలంగాణ-గజ్వేల్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గ్రామాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు మార్చి 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు మగ్గం వర్క్స్, టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచితం శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రాజలింగం తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సిద్దిపేట జిల్లాకు చెందిన వారయి ఉండాలని, 18 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సు గలవారై ఉండి కనీసం చదవడం, రాయడం వచ్చినవారు.. ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణా సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ మహిళలు మార్చి 10వ తేదీలోపు పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో పాటు మూడు ఫొటోలతో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సిద్దిపేట వారి కార్యాలయంలో తమ దరఖాస్తులను స్వయంగా అందజేయాలన్నారు.ఇతర వివరాలకు 084573 59653, 9346730388 ఫోన్ నెంబర్లలో సంప్రదించవలసినదిగా ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్



నవతెలంగాణ-సిద్దిపేట

నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే సిద్దిపేట జిల్లా విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి, మంచి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. మీ మంచి భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి, వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.



ఇథనాల్ నిల్వ గోదాముల అనుమతులు రద్దు చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

పోతారం గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఇథనాల్ ఇంధన వ్యర్థాల నిల్వ గోదాం నిర్మాణానికి తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ గోదాం నిర్మాణ అనుమతులను ప్రభుత్వం బేషరుతుగా రద్దు చేయాలని నర్సింహులపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం నర్సింహులపల్లి గ్రామస్తులుకలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు.అనంతరం కలెక్టరేట్‌లో ఏపీఓకు వినతిపత్రం అందజేశారు.



పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-వర్గల్

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గల్ మండలం ఎంపీడీవో విజయలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు జీతాలు లేక వారి బతుకులు దయనీయంగా మారాయన్నారు. సుమారు ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని స్థానిక అధికారులను అడిగినా గ్రామపంచాయతీలో డబ్బులు లేవని చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదన్నారు. అలాగే, ప్రతినెలా ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, యూనిఫామ్ ఇవ్వడంలేదని తెలిపారు. రూ.5 లక్షల ప్రమాద బీమా కట్టాలని జీవో ఉన్నా అమలు జరగడం లేదని అన్నారు. దీని వల్ల ఈ మధ్యకాలంలో చనిపోయిన గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదని తెలిపారు. వెంటనే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటాచారి, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు కనకయ్య, ఎల్లం యాదగిరి, చంద్రం, బాబురావు తదితరులు పాల్గొన్నారు



గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడి మృతి

నవతెలంగాణ-కొమురవెల్లి

ఐనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న శ్రీరాముల గణేష్.. పనిచేసే సమయంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాముల గణేష్.. 15 రోజుల క్రితం గ్రామంలో చెత్త సేకరిస్తున్న క్రమంలో ట్రాక్టర్ పైనుంచి పడి తలకు గాయమవడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, మంగళవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. సీపీఐ(ఎం) మండల నాయకులు తేలు ఇస్తారి గణేష్.. కార్మికుని భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 ఏండ్లుగా. గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుడిగా పనిచేస్తున్న గణేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షులు బ్రామాండ్ల పల్లి పర్శరాములు, ఉప అధ్యక్షులు దోతరబోయిన సాయిలు, కోశాధికారి తాడూరి రాజలింగం, సార్ల శ్రీనివాస్, మొలుగు రాజయ్య పలు గ్రామాల కార్మికులు సంతాపం తెలిపారు.



బండి సంజయ్.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులపై వ్యాఖ్యలు చేసే ముందు తన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే తీవ్రస్థాయిలో తనకు గుణపాఠం తప్పదని బీజేపీ నాయకులు బండి సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ హెచ్చరించారు. సిద్దిపేట పట్టణంలో మంగళవారం ముస్తాబాద్ చౌరస్తా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులు బండి సంజయ్ ఫ్లెక్సీని కాంగ్రెస్ కార్యకర్తలు దగ్ధం చేశారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరి కన్నతల్లి అయిన ఇతరులు కూడా అమ్మ అని పిలిచే సంస్కృతి మన దేశంలో ఉందని, ఆ విషయం బండి సంజయ్‌కి తెలియదా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బండి తన వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అతన్ని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి, జిల్లా మహిళా అధ్యక్షులు ముద్దమ్ లక్ష్మీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు, నాయకులు నాయిని నరసింహారెడ్డి, గోపి, రేణుక, వనజ, కలిముద్దీన్, గయాజుద్దీన్, వాహబ్, అజ్మత, రాశద్, మజార్ మాలిక్, హబీబ్ ఫయాజ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

మాసానిపల్లి వద్ద రక్తసిక్తం

అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్.. ముగ్గురు యువకుల మృతి.. ట్యాంకర్ పల్టీకొట్టి డ్రైవర్ కూడా దుర్మరణం



అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను బలిగొన్నది. హైవే సర్వీస్ రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును అతివేగంగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కమే మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని మాసానిపల్లి సర్వీస్ రోడ్డు అండర్ పాస్ వద్ద సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగింది.



వాజిద్ | ముక్రం | హాజీ

నవతెలంగాణ-జోగిపేట

ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన వాజిద్, ముక్రమ్, హాజీ, శంషు, రిజ్వాన్, హర్షత్‌లు స్నేహితులు. సోమవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో వారు జోగిపేట నుంచి కారులో మాసా నిపల్లి సర్వీసు రోడ్డు వద్దకు వచ్చారు. అయితే అక్కడ వాజిద్, ముక్రం, రిజ్వాన్‌లు కారులో నుంచి కిందకు దిగారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ సంగుపేట వద్ద హైవే దిగి సర్వీస్ రోడ్డు తీసుకుని మాసానపల్లి వైపు అతివేగంగా వచ్చి రోడ్డుపైన ఉన్న వారిని బలంగా ఢీ కొట్టింది. అంతేకాకుండా రోడ్డుపై ఉన్న వాజిద్(28), ముక్రమ్(29)లను బలంగా ఢీ కొట్టుకుంటూ ముందుకు లాక్కెళ్లింది. పక్కనే ఉన్న మరో యువకుడు రిజ్వాన్ తృటిలో తప్పించుకోవడంతో అతని కాలు విరిగింది. అదే వేగంతో కారును కూడా ఢీ కొట్టుకుంటూ ముందుకు వెళ్లడంతో కారులో ఉన్న హాజీ(28) అక్కడికక్కమే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు హర్షత్, శంషులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అతివేగంతో ముందుకు లాక్కొని వెళ్లిన ట్యాంకర్..

ఆయిల్ ట్యాంకర్ అతివేగంతో కారును ఢీకొట్టుకుంటూ కొద్ది దూరం గుంజుకుపోయిన తర్వాత కూడా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని ఏమాత్రం ఆపకుండా అదే స్పీడ్‌తో ముందుకు వెళ్లిపోయాడు. ఆ మార్గంలో మరో రెండు అండర్పాస్‌లు కూడా ఉన్నాయి. ఆ సమయంలో అటువైపుగా నుంచి వాహనాలు రాకపో వడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే అక్కడ భారీ ప్రమాదమే జరిగేది. అల్లాదుర్గం మండలం వద్ద ఆయిల్ ట్యాంకర్ అదే వేగంతో పల్టీ కొట్టడంతో ట్యాంకర్ డ్రైవర్ కియారమ్ కూడా మృతి చెందినట్టు అల్లాదుర్గం పోలీసులు తెలిపారు. ప్రమాద విషయం తెల్సుకున్న డీఎస్పీ సత్యన్న, జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్సై అరుణ్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాలను, క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలు విరిగిన రిజ్వాన్‌ను సంగారెడ్డికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు జోగిపేట పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ఒకే ప్రమాదంలో మృతి చెంద డంతో మైనార్టీ కుటుంబాల్లో విషాదఛాయలో అల్లుకున్నాయి. పట్టణవాసులు, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబులు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు.

రెండ్రోజుల్లో తండ్రి కాబోతున్న మృతుడు వాజిద్..

ఏడాది క్రితం వాజిద్ అనే యువకుడికి వివాహం జరిగింది. అతడి భార్య ప్రస్తుతం గర్భవతి. మరో రెండు రోజుల్లో డెలివరీ అయ్యే అవ కాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కన్న బిడ్డను చూడకముందే మృత్యువు తీసుకెళ్లడంతో స్నేహితులు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుడు స్థానిక హైస్కూల్ ఆవరణలో బైక్ మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. బీఆర్ఎస్‌లో కూడా చురుకుగా పనిచేస్తుంటాడు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే..

జోగిపేట బీఆర్ఎస్ నాయకుడు వాజిద్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జోగిపేట ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పార్టీ పరంగా ఆదుకుంటామనీ హామీ ఇచ్చారు.

బడ్జెట్ మీటింగ్ రచ్చ రచ్చ..

- ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధం
- వార్నింగ్ ఇచ్చిన ఎమ్మెల్యే రోహిత్
- క్షమాపణ చెప్పిన కౌన్సిలర్ ఆంజనేయులు

నవతెలంగాణ-మెదక్

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన బడ్జెట్ మీటింగ్ రచ్చ రచ్చ అయింది. ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. వేదిక వద్ద కౌన్సిలర్లు, సభ్యులు గుమి గూడటంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే మాస్ వార్నింగ్ ఇవ్వగా, చివరకు కౌన్సిలర్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మంగళవారం మెదక్ మున్సిపల్ లో ఛైర్మెన్ చంద్రపాల్ అధ్యక్షతన జరిగిన 2024-25 బడ్జెట్ సమా వేశానికి ఎమ్మెల్యే రోహిత్ రావు, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలు స్వార్థ పూరితమైనవని, కాగితాలు మాటల్లో తప్ప ఎక్కడా అభివృద్ధి జరిగింది లేదన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక రెండు నెలల్లో రూ.80 వేలు ఉన్న మున్సిపల్ ఆదాయాన్ని రూ.5 లక్షలు చేయడం జరిగిందన్నారు. మెదక్ ఖిల్లాకు లైట్లు, చౌరస్తల సుందరీకరన చేపట్టడం జరిగినట్లు తెలిపారు. పదేళ్లలో అభివృద్ధి చేయడం చేతకాని వాళ్లకు తనను ప్రశ్నించే అర్హత లేదన్నారు.

మీ జీతగాన్ని కాదు.. నీ జీతగాన్నా..

బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్ మున్సిపల్ వైస్ చైర్మెన్ మల్లిఖార్జున్ గౌడ్, చైర్మెన్ చంద్రాపాల్ మధ్య గత ప్రస్తుత ప్రభుత్వాల పనితీరు పట్ల చర్చ జరుగుతున్న సమయంలో 5వ వార్డు కౌన్సిలర్ జోక్యం చేసుకోవడం వాగ్వివాదానికి దారితీసింది. ఇది మున్సిపల్ బడ్జెట్ సమావేశమా లేక రాష్ట్ర బడ్జెట్ సమావేశమా అని ప్రశ్నించారు. ఎవరిని అడుగుతున్నావు మీ జీతగాన్ని కాదు అంటే నీ జీతగాన్నా అంటూ ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. పైసలకు అమ్ముడుపోయినోళ్ల అభివృద్ధి గూర్చి మాట్లాడటమేంటి అని ఎమ్మెల్యే కౌన్సిలర్ పై ఫైర్ అయ్యారు. ఏం మాట్లాడుతున్నావు, ఏం తమాషా చేస్తున్నావా ఎక్కువ తక్కువ మాట్లాడితే వేరేలా ఉంటది, మెదక్ అభివృద్ధిని అడ్డుకోమని బీఆర్ఎస్ వాళ్ళు పంపారా అంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. నా స్థాయి పెద్దది అని గుర్తించి నీ స్థాయిలో నువ్వు మాట్లాడాలని మండిపడ్డారు. సమావేశం చివర్లోఅనుచితంగా ప్రవర్తించి ఉంటే సారీ అంటూ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పారు.

అంతకుముందు బడ్జెట్ సమావేశంలో కౌన్సిలర్లు మేడి కళ్యాణి మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా మెదక్ పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, రోడ్లు, మురికి కాలువలు అలాగే ఉన్నాయని, ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల ముందుకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించిన పరిస్థితి లేదన్నారు. నీటి బిల్లులను వసూలు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ అధికారులు పైసలు ఇవ్వనిదే ఫైళ్ళను ముందుకు కదలనివ్వని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఐడిఎస్ఎంటి ఫేస్ -2 విషయంలో నిరుపేదలు డబ్బులు చెల్లించి ఏళ్ల గడుస్తున్నా స్పష్టత ఇవ్వడం లేదని



మండిపడ్డారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలన్నారు. కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు, చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారని ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. అధికారులు, ఛైర్మెన్, కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. మెదక్ మున్సిపల్ ప్రజలు కట్టే ట్యాక్స్ మీదనే ఆధారపడి ఉందని, అదనపు నిధులు రాకపోవడం కారణంగానే మున్సిపల్ అభివృద్ధి నోచు కోవడం లేదన్నారు. ఎమ్మెల్సీ, ఎంపి వంటి పలు రకాల ప్రత్యేక నిధులను కేటాయిస్తే అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా జరగని గృహాలకు ఛార్జ్ ఎలా వేస్తారని ప్రశ్నించారు వెజ్, నాన్ వెజ్ మార్కెట్, స్మశాన వాటిక, అనిమల్ ఎసిబెన్దరీ పనులు సగంలో ఆగిపోయాయని, కాంట్రాక్టర్ ను పిలిచి పనులు జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పటేల్ కుంట దుకాణాల టెండర్ల విషయంలో చర్యలు తీసుకుంటే మున్సిపల్ కు ఆదాయం సమకూరే అవకాశాలున్నాయన్నారు. సమావేశంలో ఆయా వార్డుల కౌన్సిలర్‌లు వ్యక్తపరిచిన అంశాల పై మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్ స్పందిస్తూ.. రెండేళ్ల కరోనా వచ్చినా అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగి ందన్నారు. పట్టణ ంలోని అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించామని, ఆన్ లైన్ లో పెట్టుకొనే దరఖా స్తులను పరిశీలించి అధికారులు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం గత ప్రభుత్వం కృషి చేసిందని, ఈ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చిందని తెలిపారు. కానీ కొన్నింటి వలన సంక్షేమం మితి మీరి నిధులు సరిపోవడం లేదని, స్థానిక సంస్థలు భారం కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు క్షేత స్థాయిలో పరిశీలన చేసి నిధుల సమీకరణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ చంద్ర పాల్, వైస్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్, కమిషనర్ జానకిరాంసాగర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు కిషోర్, విశ్వం, శేఖర్, జయరాజ్, దొంతి లక్ష్మి, మామిల్ల ఆంజనేయులు, సమిఉద్దీన్, కృష్ణా రెడ్డి, ఆర్కె శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, సుంకయ్య, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పరీక్షలు రాయనున్న 20949 మంది విద్యార్థులు

44 సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-సిద్దిపేట

నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 44 సెంటర్లను ఏర్పాటుచేసి, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చారు. మంచినీరు, గాలి వెలుతురు వచ్చే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లోని గదుల్లో విద్యార్థుల సిట్టింగ్ సంబంధించిన హాల్ టికెట్ల నంబర్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా 44 పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేయనున్నారు.

పరీక్షలు రాయనున్న 20949 మంది విద్యార్థులు..

ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జనరల్, వొకేషనల్ గ్రూపులకు చెందిన 20949 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 9,831 మంది మొదటి సంవత్సరం, 11,118 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆర్టీసీ బస్సు



లు ఏర్పాటు చేయడం, జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాల నుంచి జిల్లా డీఆర్‌డీసీకి తంలించేందుకు పోస్టల్ శాఖ తగిన ఏర్పాట్లు చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ పర్యవేక్షణలో హై-పవర్ కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని 44 పరీక్షా కేంద్రాల్లో 20 ప్రభుత్వ జూనియర్ కళా శాలలు, 15 ప్రయివేటు జూనియర్ కళాశాలలు ఉండగా.. మరో 9 పరీక్షా కేంద్రాలు ప్రభుత్వ అనుబంధ కళాశాలలను ఎంపిక చేశారు. ప్రయివేటు జూనియర్ కళాశాలలు కేంద్రాల ఎగా ఎంపిక చేసిన వాటిలో సీఎస్, డీఓలతో పాటు అదనం గాఅసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లను కూడా నియమించనున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటల పాటు పరీక్ష జరగనుంది. పరీక్ష రాసే విద్యార్థులను గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకొని, 8:30 కల్లా తమ తమ సీట్లలో కూర్చోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి లోనవకుండా ఉండేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసిన 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేస్తే, టెలి మానస్ సేవ ద్వారా విద్యార్థుల్లో భయాన్ని తొలగించే సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా రాయండి : సూర్య ప్రకాష్, డీఐఈఓ

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయండి. పరీక్షా సమయానికి గంట ముందే మీ సెంటర్‌కు చేరుకొని, మీకు ఇచ్చే ఓఎంఆర్ షీట్‌ను క్షుణ్ణంగా పరిశీలించుకోండి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వరు. మీకు ఎలాంటి ఇబ్బంది కలిగిన హాల్‌లో ఉన్న ఇన్విజిలేటర్‌కు చెప్పండి. ఆల్ ది బెస్ట్..



రైతులకు బయోచార్‌పై అవగాహన

నవతెలంగాణ-రాయపోల్

పత్తి పంట పూర్తయిన తర్వాత వచ్చే వ్యర్థాలతో సేంద్రియ కర్బనం, నేల నిర్మాణం, నీటి నిలువ సామర్థ్యం పెంచుకోవచ్చని దేశ్ పాండే ఫౌండేషన్ ప్రొడ్యూస్ యూనిట్ కోఆర్డినేటర్ దాతర్‌పల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం ముంగిస్ పల్లి, ఆరేపల్లి గ్రామాల్లో దేశ్‌పాండే ఫౌండేషన్, బీసీఐ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు బయోచార్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. పత్తి పంట తొలగించిన తర్వాత వచ్చిన వ్యర్థాలను బొంగరపు ఆకారంలో తీసిన గుంతలో వేసి పూర్తిగా కాల్చి మెత్తటి బొగ్గులా చేసుకొని వచ్చిన బొగ్గుకు మోతాదుకు తగ్గట్టు సేంద్రియలు కలుపుకొని మరలా తిరిగి పంట పొలాలకు వాడుకోవచ్చని తెలిపారు. దీనివల్ల సేంద్రియ కర్బనం, నేల నిర్మాణం, నేల నీటి నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెంచుకోవచ్చని, వాటితో పాటు సూక్ష్మ జీవుల వృద్ధి జరుగుతుందన్నారు. పంట దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళా..

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కలెక్టర్‌గా ప్రిన్సీ, డీఈవోగా బాబు, ఎంఈవోగా శ్రీ కరణ్, ప్రధానోపాధ్యా యులుగా బి.శ్రీజ వ్యవహరించగా.. వారి అనుభవాలను పంచుకు న్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు శంకం రెడ్డి, ఉపాధ్యాయులు సీహెచ్ నర్సింగారావు, టి.రవీ ందర్ రావు, వి.రమా కాంతరావు, డి.విశ్వేశ్వర్, ఎం.డి. షాబీద్దీన్, మల్లేశం, ప్రశాంతి, అంజలి, విద్యార్థులు తదితరులున్నారు

కరెంటు అల్యూమినియం వైర్‌చోరీ చేసిన అంతర్రాష్ట్ర నిందితులు అరెస్ట్

నవతెలంగాణ-కొండపాక

సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వెంచర్లలో విద్యుత్ స్తంభాలకు ఉన్న అల్యూమినియం వైర్లను కట్ చేసి చోరీ చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం అరెస్ట్ చేసినట్టు గజ్వేల్ ఏసీపీ బాలాజీ తెలిపారు. నిందితుల నుంచి ఆటో, మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, వైర్ కట్టర్, 1280 కేజీల అల్యూమినియం కండక్టర్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వెలికట్ట శివారులోని ఒక వెంచర్‌లో విద్యుత్ వైరు చోరీ చేసిన విషయాన్ని ఈనెల 19న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మంగళవారం ఉదయం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో ముగ్గురు వ్యక్తులు అల్యూమినియం వైరుతో వెళ్తుండగా అనుమానం వచ్చి వారిని విచారించగా.. దొంగతనాన్ని ఒప్పు కున్నారు. దూల్‌మిట్ట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంగులోతు చంద్రశేఖర్ నూతనంగా నిర్మించే ఇండ్ల లో కరెంటు వైర్ ఫిట్టింగ్ చేస్తూ జీవించేవాడు. పనిచేస్తే వచ్చే డబ్బులు తన జల్సాలకు సరిపోనందున



నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ల వద్ద కరెంటు అల్యూమినియం వైర్ దొంగలించి అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని నిర్ధారించుకున్నాడు. దాన్ని అమలు చేయడానికి తన స్నేహితులు కరీంనగర్ జిల్లా కేశవపట్నం గ్రామానికి చెందిన అగుళ్ల శ్రీనివాస్, హుజురాబాద్‌కు చెందిన కడారి జలంధర్‌కు విషయం చెప్పగా.. వారూ ఒప్పుకున్నారు. దాంతో ముందుగా చంద్రశేఖర్ తన మోటార్ సైకిల్ ప్రయాణిస్తూ ఎక్కడెక్కడ నూతనంగా నిర్మించిన వెంచర్లు ఉన్నాయో చూస్తూ ఉండేవాడు. తర్వాత ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడేవారు. ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు వద్ద ఉన్న వెంచర్‌లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కరెంటు వైర్ కట్ చేసి ప్రజ్ఞాపూర్‌లో ఉన్న స్క్రాప్ దుకాణంలో అమ్మారు. తర్వాత కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం దారిలో నూతనంగా నిర్మించిన వెంచర్‌లోని విద్యుత్ స్తంభాల వైర్లను కట్ చేసి చోరీ చేశారు. మెదినీపూర్ శివారులోని వెంచర్‌లో విద్యుత్ వైర్లను దొంగిలించి సిద్దిపేటలోని ఓ స్క్రాప్ దుకాణంలో అమ్మారు. వెలికట్ట శివారులోని వెంచర్‌లో, వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వెంచర్‌లో, కరీంనగర్ జిల్లా మానకొండూరు శివార్లలోని వెంచర్లలో విద్యుత్ వైర్లను చోరీ చేశారు. మంగళవారం ఆటోలో విద్యుత్ వైర్లను తీసుకుని ప్రజ్ఞాపూర్ వెళుతుండగా వారిని పట్టుకుని విచారించగా విషయం బయట పడిందని ఏసీపీ తెలిపారు. వీరి ముగ్గురిపై దొంగతనాల కేసులు ఏడు నమోదయ్యాయని, నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. వైరు విలువ సుమారు రూ.3,32,000 ఉంటుందన్నారు. సీపీ అనురాధ సూచనలతో ఏసీపీ బాలాజీ పర్యవేక్షణలో నిందితులను చాకచక్యంగా పట్టుకుని ఏడు కేసులను ఛేదించిన తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు రమణమూర్తి, యాదగిరి, కానిస్టేబుళ్ల రమేష్, రాజు, కరుణాకర్‌ను ఏసీపీ అభినందించారు. రివార్డు కోసం ప్రపోజల్ పంపిస్తున్నట్టు తెలిపారు. దొంగసొత్తు కొన్న వారిపై కూడా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నూతనంగా వెంచర్లు చేసే యజమానులు వాటి రక్షణ గురించి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్పీని కలిసిన మైత్రి ఫౌండేషన్ చైర్మెన్



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ చైర్మెన్ చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్‌ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రజలకు తమ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్ మహమ్మద్ హాషిమ్‌కు కార్పొరేటర్ అభినందనలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్-2024 పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన రామచంద్రాపురం డివిజన్‌కి చెందిన మహమ్మద్ హషిమ్‌ను కార్పొరేటర్ పుష్ప నగేష్ మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహమ్మద్ హషిమ్ డివిజన్‌లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీ లో ఉన్న మజిల్ టెక్ జిమ్ కోచ్‌గా అందరికీ కోచింగ్ ఇస్తూ.. నేడు రాష్ట్ర స్థాయిలో జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో రెండోస్థానంలో నిలిచారన్నారు. కార్పొరేటర్‌తో పాటు పీఎస్ ఫౌండేషన్ చైర్మెన్ బూరుగడ్డ రాకేష్ రాజ్, బైకాన్ నవీన్ యాదవ్, మహమ్మద్ ఖాజా, ఈర్ల మహేష్ తదితరులు హాషింను సన్మానించిన వారిలో అన్నారు..



ఎమ్మెల్యేను కలిసిన నూతన తహసీల్దార్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దేవదాస్.. ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌ను మంగళవారం కలిశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరించి.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు.

చెరకు రైతులకు రూ.5కోట్ల బకాయిలు చెల్లింపు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ చెరకు రైతులకు బకాయి ఉన్న రూ.5కోట్లను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రైతులకు చెల్లించినట్టు ట్రైడెంట్ చక్కర పరిశ్రమ డైరెక్టర్ ఖీజర్ యాఫెయి తెలిపారు. మంగళవారం సాయంత్రం పత్రికా ప్రకటనలో వివరాలను వెల్లడించారు. గతేడాదికి సంబంధించిన చెరకు రైతుల బిల్లులను ట్రైడెంట్ చక్కర పరిశ్రమ యాజమాన్యం విడతల వారీగా చెల్లిస్తూ రైతులకు రూ.7.38 కోట్లు చెల్లించడంలో జాప్యం చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు హెచ్చరికాలు జారీ చేస్తూ గడువులోగా చెల్లించని పక్షంలో పరిశ్రమను వేలం వేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ట్రైడెంట్ పరిశ్రమను ఈనెల 28న వేలం వేయడానికి పలు నోటీసులు కూడా జారీ చేసింది. దాంతో స్పందించిన ట్రైడెంట్ పరిశ్రమ డైరెక్టర్ ఖీజర్ యఫై.. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి సమక్షంలో రైతులకు చెల్లించాల్సిన రూ.7.38 కోట్ల బకాయిల్లో రూ.5 కోట్లను 1973 మంది రైతుల ఖాతాలకు చెల్లించారు. మిగతా 2.38 కోట్లను సోమవారం రోజున చెల్లిస్తామని డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత యాజమాన్యంలో ఉన్న కొన్ని లోపల వల్ల రైతులకు చెల్లించాల్సిన బకాయిల చెల్లింపుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.5కోట్లను చెల్లించామని.. మిగిలిన పెండింగ్ బకాయిలను సోమవారం రోజున చెల్లిస్తామన్నారు.

వేలానికి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు..

ట్రైడెంట్ పరిశ్రమను వేలం వేసేందుకు అధికారులు పూర్తి ఏర్పాటు చేశారు. నేడు(బుధవారం) స్థానిక పరిశ్రమ ఎదుట జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వేలంపాట నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు డీఏఓ మహేష్ కుమార్ తెలిపారు. కాగా చెల్లింపు జరగడంతో వేలంపాట జరుగుతుందో.. లేదో వేచి చూడాలి.



బస్తీ దర్శన్‌తో ప్రజల సమస్యలకు పరిష్కారం

నవతెలంగాణ-రామచంద్రాపురం

బస్తి దర్శన్‌లో భాగంగా భారతినగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని కార్పొరేటర్ సింధూ ఆదర్శ రెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా, బీడీఎల్ మరియు విద్యుత్‌నగర్‌లో మంగళవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఫెన్సింగ్ ఏరియాలో మంచినీటి సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు తెలుపగా.. నీటి కనెక్షన్‌ను చెక్ చేసి అవసరమైతే కొత్త పైపులైన్ వేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. అలాగే బీడీఎల్ కాలనీలో డ్రయినేజీ లైన్ మంజూరు అయినందున త్వరగా సమస్య పరిష్కరించాలన్నారు. విద్యుత్‌నగర్‌లో రోడ్ నంబర్ 14లో నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలపడంతో.. బోర్‌వెల్ రిపేర్ చేయించడంతో పాటు రెండ్రోజుల్లో మంచినీటి వాల్స్ అన్ని తనిఖీ చేసి సరిచేస్తామని అధికారులు తెలిపారు. వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. బస్తి దర్శన్‌లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను నోట్ చేసుకొని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్, డీజీఎం శివ కృష్ణ, ఏఈ జనార్ధన్, కాలనీ వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌బాబును తొలగించాలని కమిషనర్‌కి వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని అదనపు సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మున్సిపలలో అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డి మున్సిపల్‌లో అనేక ఏండ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తూ.. వారి స్థానంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబు తన సొంత బామ్మర్ది, కుటుంబ సభ్యులను నల్గొండ నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపించారు. అలా అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించకపోతే నేటి(బుధవారం) నుంచి విధులు బహిష్కరిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'విజయబాబు హఠావో.. సంగారెడ్డి మున్సిపల్ బచావో' అనే నినాదంతో పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, మల్లేశం, శివ, పాండు, వేణు, ప్రభువు, కిరణ్, అనిల్, గణేష్ ,రాజు, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఎల్లమ్మ తల్లి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో ఎల్లమ్మ తల్లి జాతరలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు.ప్రతి ఒక్కరు మన సాంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని కోరారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలం దరూ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం గౌడ్, రాజు గౌడ్, యాదయ్య, నరేష్ యాదవ్, సుధాకర్, యాదయ్య, లక్ష్మణ్, యాదగిరి,కుమర్, శ్రీనివాస్, గణేష్, మహేష్, జాతర నిర్వాహకులు, ప్రజలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నరోడ్లతో ఇక్కట్లు

- విస్తరణకు నోచుకోని బీదర్ రోడ్డు
- నిత్యం రద్దీగా ఉన్నా.. పట్టించుకోని యంత్రాంగం
- పైపొచ్చు గుంతలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

బీదర్-జహీరాబాద్ రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిగుండా నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీ ఎక్కువగా ఉండి.. డబుల్ రోడ్డు మాత్రం ఉండడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు గుంతలు పడి ఉండడంతో ప్రమాదకరంగా ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

హైదరాబాద్, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ లాంటి మండలాల ప్రజలు నిత్యం ఈ రహదారి గుండా ప్రయాణాలు చేస్తుం టారు. బీదర్ పట్టణంలోని ఆసుపత్రికి, అలాగే వివిధ రకాల వ్యాపా రులు, విద్యార్థులు నిత్యం ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నా.. రోడ్డు విస్తరణా పనులు మాత్రం చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరకు పంట సీజన్ వస్తే.. ఎడ్లబండ్లపై, ట్రాకర్లపై చెరకును ఈ దారి గుండానే తరలిస్తుంటారు. అయితే అప్పటికే చిన్న రోడ్లు కావడం.. దానికితోడు ఒకేసారి వరుసగా ఆ బండ్లు రావడంతో ఆ సమయంలో ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దానికితోడు పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో.. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. రోడ్డు విస్తరణా పనులు చేపట్టాలని స్థానికులు, ఈ రోడ్డు గుండా ప్రయాణించే వారు కోరుతున్నారు.

బాల సదనంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్జి హనుమంతరావు



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవధికారి సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఉత్తర్వుల ప్రకారం జిల్లా న్యాయ సేవధికారి సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికారి, సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు సంగారెడ్డి పట్టణంలోని బాలాసదనంను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి హనుమంతరావు మాట్లాడుతూ.. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని.. వారికి సమయానికి భోజనం అందించాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే తొందరగా దగ్గరలో ఉన్న దావఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచిం చారు. పిల్లలకు ఏ.విధంగా చదివించాలో సూచనలు సిబ్బందికి చేశారు. బాలసదనం పరిసరాలు వంటగది తిరిగి పరిశీలించారు. వారికి కావాల్సిన సూచనలు చేశారు. పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని కోరారు. ఏదైనా న్యాయ సహాయం కావాల్సి వస్తే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలసదనం పర్యేవేక్షకురాలు విజయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విస్డమ్ రైసింగ్ ఫౌండేషన్ ఉదారత్వం

- పదో తరగతి విద్యార్థులకు పరీక్షాప్యాడ్‌లు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-సదాశివపేట

విస్డమ్ రైసింగ్ ఫౌండేషన్ సదాశివపేట వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను, పెన్నులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా విస్డం రైసింగ్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులందరూ పబ్లిక్ ఎగ్జామ్స్‌లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి మాట్లాడుతూ.. విస్డం రేసింగ్ ఫౌండేషన్ సభ్యులను ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని చేయాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీ.శ్రీనివాస్, ఎల్లేష, కె.శ్రీనివాస్, పి.అరవిందరావు, ఎన్.సుభాష్, కె.అరుణ్ కుమార్, ఆర్.సురేందర్, ప్రేమ్, విష్ణు, రాజు, సందీప్, సత్యానందం, నర్సింలు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రావిడెంట్ ఫండ్ సేవలు

- పటాన్‌చెరు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్
- ఉద్యోగులు పదవి విరమణ రోజే పెన్షన్



నవతెలంగాణ-పటాన్‌చెరు

భవిష్య నిధి (ప్రావిడెంట్ ఫండ్)కి సంబంధించిన ఏ సేవలైన నేరుగా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చని, మొబైల్ మీట నొక్కితే చాలని, ప్రత్యేకించి పీఎఫ్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అనసరం లేదని పటాన్‌చెరు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. 'నిధి ఆప్కే నికట్ 2.0' (ప్రజల వద్దనే సమస్యల పరిష్కారం)లో భాగంగా మంగళవారం పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.పెద్దిరాజు, అకౌంట్స్ అధికారి బి.మనోజ్, ఇతర సిబ్బందితో కలిసి గీతం అధ్యాపకులు, సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. పరిష్కారం, సమాచార మార్పిడి, అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భవిష్య నిధి సభ్యులు తమ పీఎఫ్ అకౌంట్‌ను ఆధార్, పాన్‌కార్డులతో అనుసంధానం చేసుకుంటే, ఆన్‌లైన్‌లోనే ఎంత మొత్తం నిల్వ ఉంది, నెల వారీ పీఎఫ్ జమ,ఇ-నామినేషన్ వంటి పనులన్నింటినీ మొబైల్ ఫోన్‌తోనే చేసుకోవచ్చని, పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన స్పష్టీకరించారు. 'ప్రయాస్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు రిటైర్డ్ అయిన రోజే పెన్షన్ పొందే వీలు కల్పిస్తున్నామని, తమకు వచ్చే దరఖాస్తులను రెండు మూడ్రోజుల్లోనే పరిష్కరిస్తున్నట్టు విశాల్ ఆగర్వాల్ తెలిపారు. గతేడాది జనవరి నుంచి ప్రతినెలా 27న 'నిధి ఆప్కే నికట్' పేరిట దేశవ్యాప్తంగా పీఎఫ్ సేవలను ఉద్యోగుల పని ప్రదేశాల్లోనే అందుబాటులోకి తెచ్చి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. విస్తృతమైన ప్రజల భాగస్వామ్యంతో వారు సంతృప్తి పొందేలా పీఎఫ్ సేవలను సమర్థవంతంగా అందజేస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో క్లెయిమ్లను దాఖలు చేయడం, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం వంటి ఆన్‌లైన్ సేవలను అవసరార్థులకు అందించడానికి హెల్ప్‌డెస్క్ సైతం ఏర్పాటు చేశారు. తద్వారా ఈపీఎఫ్ అధికారులు, ఉద్యోగులతో పరస్పర చర్చకు, అవగాహన పెంపొందించడానికి, అనుమానాల నివృత్తి చేసుకోవడంతో పాటు పీఎఫ్ సేవలు సులువుగా పొందే వీలు కలిగింది. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్ఆర్ వర్మ, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, సహ సిబ్బంది తదితరులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని.. తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసినకొందరు ఉద్యోగులకు పెన్షన్‌ధ్రువపత్రాలను అందజేశారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన యూనిసెఫ్ ఢిల్లీ బృందం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రాన్ని యూనిసెఫ్ ఢిల్లీ బృందం జైరస్ లిగూ, డాక్టర్ జెలాలెం బి.టాఫెస్సేలు మంగళవారం సందర్శించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో జైరస్ లిగూ మాట్లాడుతూ.. అన్నిరకాల సేవలను ఒకే గొడుగు కింద అందించడం హర్షణీయమన్నారు. బాధితులకు అన్ని తానై, కేసు నమోదు మొదలుకొని వారికి న్యాయం జరిగే విధంగా వారి వెన్నంటి ఉంటూ, న్యాయపరమైన సూచనలు చేస్తూ, అవసరాన్ని బట్టి వారికి షెల్టర్ ఇప్పించడం, బాధిత మహిళలకు నష్ట పరిహారం ఇప్పించడం వంటి భరోసా సెంటర్ సేవలు అభినందనీయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో భరోసా సెంటర్ పనితీరు బాగుందని కొనియాడారు. మైనర్ బాల, బాలికలచే పోలీసు స్టేషన్ కు వచ్చినప్పుడు వారి సహాయార్థమై, బాల నేరస్తులను విచారించేటప్పుడు పోలీసు స్టేషన్ వాతావరణం కనిపించకుండా ఒక ఫ్రెండ్లీ నేచర్‌లో విచారించడానికై 'చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్'ను ఏర్పాటు చేయడం ఒక మంచి ఆలోచన అని అన్నారు. జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్‌లలో కూడా 'చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్' ఏర్పాటు చేసే విధంగా చూడాలని, అందుకు తమ వంతు ఆర్థిక సహాయ చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో యూనిసెఫ్ బృందంతో పాటు భరోసా సెంటర్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, పోలీసు డాక్టర్ జ్యోతి, భరోసా ఇంచార్జ్ ఎస్ఐ. నాగలక్ష్మి, కో-ఆర్డినేటర్ దేవ లక్ష్మీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి యువనేత లోకేష్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మానేయ్య మాతృమూర్తి మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కుమారుడు, యువనేత లోకేష్‌రెడ్డి వెంటనే మృతురాలి ఇంటికి వెళ్లి భౌతికాయాన్ని సందర్శించి నివాళ్ల ర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని అందిం చారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దీపక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రె స్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ప్రవీణ్ గౌడ్, సాయిచరణ్, సుదర్శన్, నగేష్ ,శివయ్య, అరవింద్ ,త దిత రు లు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ



నవతెలంగాణ-జోగిపేట

రాబోవు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు వేయొద్దని.. గెలిచే పార్టీకి ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. మంగళవారం రాత్రి బీజేపీ విజయ సకల్ప యాత్రలో భాగంగా కార్నర్ మీటింగ్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూడోసారి మోడీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర కొనసాగుతున్నదన్నారు. మహిళ సాధికారిక కోసం చట్టసభల్లో ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా 33శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. మగవారికి సమానంగా మహిళలను త్రివిధ దళాల్లో ప్రోత్సహం ఇస్తున్నారన్నారు. దేశమంతా మహిళల కోసం ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ, రూ.12 కోట్ల టాయిలెట్స్ కట్టించిన ఘనత మోదీ బీజేపీ ప్రభుత్వానిది అన్నారు. కరోనాలో ప్రజలను ప్యారాసెట్మాల్ గోలి వేసుకోమని కేసీఆర్ ఫామ్ హౌస్‌లో వెళ్లి పడుకున్నాడని.. మోదీ ప్రజల కోసం వ్యాక్సిన్ ఇచ్చిండు అని గుర్తు చేశారు. తెలంగాణలో 17 స్థానాల్లో బీజేపీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు అలే భాస్కర్, జైపాల్ రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, శ్రీనివాస్ కార్గే, ప్రభాకర్ గౌడ్, జగన్నాథం, అనంతరావు కులకర్ణి, సుమన్, చంద్రశేఖర్, శివశంకర్, శివచందర్, సతీష్, పావని తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్‌లో ఈసీసీ డే



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని చిన్నచెల్మెడ గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్‌లో ఎర్లీచైల్డ్ హుడ్‌కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీ డే) అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు నేర్పించిన విద్యా బుద్దుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించి అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా చివరి వారంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



గ్రామాలలోని చిన్నపిల్లలకు గర్భిణీ బాలింతలకు అంగన్వాడీలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో అంగన్వాడి టీచర్లకు ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాలను పూర్తిచేసే విధంగా కృషి చేస్తానన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, సిడిపిఓ హేమా భార్గవి, బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పదవ తరగతి తొలిమెట్టు లాంటిది

- కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలి
- జీఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్

నవతెలంగాణ-మనోహరాబాద్



పదవ తరగతి ప్రతి విద్యార్థికి తొలిమెట్టు లాంటిదని విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి ఫలితాలను సాధించాలని జీఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి తొలిమెట్టులాంటిదన్నారు. విద్యార్థులు మానసిక వత్తిడి లేకుండా కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణతేజ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-పాపన్నపేట



మండల పరిధిలోని మినుపూర్, కుర్తి వాడ గ్రామాలలో ప్రముఖ సంఘ సేవకర్త గట్టు ప్రశాంత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు, మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 500 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఆపరేషన్ అవసరమున్న 95 మందిని మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఈ వైద్య శిబిర కార్యక్రమంలో డాక్టర్లు గగన, దస్తగిరి, ఒబీడ్ శ్రీయ , రవిచంద్ర, మార్కెటింగ్ ఇంచార్జి కుమార స్వామి, నాగార్జున, సత్యనారాయణ, అఖిలలు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్
- మహిళలకు గ్యాస్ కలెక్షన్లు పంపిణీ

నవతెలంగాణ-నర్సాపూర్



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మహిళలకు ఉచితంగా మంజూరైన గ్యాస్ కలెక్షన్లను మంగళవారం నర్సాపూర్‌లో మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ యాదవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధిని ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్, నాయకులు నాగేష్, ఆంజనేయులు గౌడ్, కంది ప్రభాకర్, భాస్కర్, సాహితీ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీని గెలిపించాలి

- అధికార ప్రతినిధి రాణి రుద్రమ

నవతెలంగాణ-నిజాంపేట



దేశంలో మరోసారి బీజేపీని గెలిపించాలని రాష్ట్ర అధికార ప్రతినిది రాణి రుద్రమ కోరారు. బిజెపి తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర సిద్దిపేట నుంచి ప్రారంభమైన బైక్ యాత్ర మెదక్ జిల్లాలోని నిజాంపేటకు మంగళవారం చేరుకుంది. మండల బిజెపి నాయకులు, మహిళలు వారిని బోనాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికి గజమాలతో ఘనస్వాగతం పలికారు. కల్వకుంట ఎక్స్ రోడ్డు నుంచి నిజాంపేట వరకు భారీగా దాదాపు 500 బైకులతో ర్యాలీ నిర్వహించారు. నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి రుద్రమ మాట్లాడుతూ దేశాన్ని ఎవ్వరు బాగుచేస్తారో, దేశాన్ని ఎవ్వరు రక్షిస్తారో వారికి ఓటు వేయాలన్నారు. దేశానికి రక్షణ కవచంగా ప్రదానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు బస్వా లక్ష్మీనర్సయ్య, నందారెడ్డి, కర్ణం పరిణీత, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సీనియర్ నాయకులు నిజాంపేట మండల జడ్పిటిసి పంజా విజయ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, నవత్ రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, తీగల శ్రీనివాస్ గౌడ్, నరేష్ మహంకాళి, జాల పోచయ్య, జిపి స్వామి బొమ్మన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు

- హాజరైన మాజీఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ -పాపన్నపేట



పాపన్నపేటలో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో హనుమంతరావును శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాన్ని వివిధ రకాల బంతి పువ్వులతో, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం గౌడ సంఘము ఆధ్వర్యంలో ఉదయం నుంచి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పెద్ద గౌడ కులస్థులు శుద్ధిగా తయారు చేసిన కల్లు కుండ, దున్న గౌడ కులస్థులు బోట్టు, వస్త్రా అలంకరణ, ఆభరణాల సామాగ్రి ఆనవాయితీ ప్రకారం డప్పుచప్పులతో అందరూ కలిసి మంగళ హరతులతో అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించినారు. మధ్యాహ్నం పిండి వంటల నైవేద్యం అమ్మవారికి సమర్పించారు.. ఆలయ ప్రాంగణం ఎల్లమ్మ పాటలతో దద్దరిల్లింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు విచ్చేసి ఎల్లమ్మను, దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కులస్తులు నరేందర్ గౌడ్ సత్య గౌడ్ ప్రవీణ్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, గోవింద్ నాయక్, శ్రీకాంత్ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ నిటలాక్షప్ప. ముశెట్టి కిష్టయ్య ఇబ్రహీం , గౌస్ మానయ్య, సంగమేష్, వెంకటేశం,శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, రామా గౌడ్, బాబర్ పటేల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు

పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-కొల్చారం



పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో జరిగిన పెద్దమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవానికి హాజరైన నీలం మధు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలం మధుకు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించి అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ గ్రామాలలో జరిగే ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెరుగుతుందన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు నెల్లి రాజు, జంగిటి మోహన్, ఆకుల రాజు, కాశం శ్రీనివాస్, దాకం యాదగిరి, కాశం మల్లేశం, రాము, గ్రామ పెద్దలు, ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు, ఎన్.ఎం.ఆర్ యువసేన సభ్యులు, పాల్గొన్నారు.

విషపు మొక్కలు తినడం వల్లనే మేకలు మృత్యు వాత పడ్డాయి

- మండల పశువైద్య అధికారి



నవతెలంగాణ-నార్సింగి: మండల పరిధిలోని మల్లన్న గుట్ట అటవీ ప్రాంతంలో వల్లభాపూర్ గ్రామానికి చెందిన బత్తుల సాయిలు సోమ వారం మేతకు తీసుకుని వెళ్లి తిరిగి తీసుకు వస్తున్న తరుణంలో 45 మేకలు నురుగు కక్కు కుంటూ మృతి చెందాయి. మంగళవారం ఉదయం నార్సింగి మండల పశువైద్య అధికారి జీవన్ ప్రతాప్ మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం వివరాలను వెల్లడిస్తూ విషపు మొక్కలు ఎక్కువ మోతాదులో తినడం వలన మేకలు మృత్యువాత పడ్డాయని తేల్చారు. ఆ విషపు మొక్కను కొద్ది మోతాదులో తింటే నష్టం వాటిల్లేది కాదని, మేత కొరత వల్ల విషపు మొక్క అన్న విషయం తెలియక కాపరి సాయిలు కూడా ఎక్కువగా ఉన్న ఆ మొక్కలనే కొట్టి మేకలకు వేశాడన్నారు. మేకలకు బీమా చేయించ లేదని జీవన్ ప్రతాప్ తెలిపారు. చేగుంట మండల తహశీల్దార్ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. బీమా లేనందున నష్ట పరిహారం కొరకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించి, బాధితున్ని ఆదుకునే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాపరి సాయిలు మాట్లాడుతూ తాను ఎప్పటి మాదిరిగానే మేకలను మేత కొరకు తీసుకు వెళ్లానని తెలిపారు. తాను మేకలకు వేసిన మొక్కను చూపిస్తూ ఇంతకు ముందు కూడా మేకలకు వేశానని, కానీ ఇలా జరగ లేదన్నారు. సోమవారం 45 మేకలు మృతి చెందగా మంగళవారం ఒక మేక మృతి చెందిందని, తనకున్న 60 మేకలలో 46 చని పోయాయన్నారు. మృతి చెందిన మేకల విలువ ఐదు లక్షల పైనే ఉంటుందన్నారు. తాను పేద వాడినని, ఈ ఘటన వల్ల తన జీవనాధారం కోల్పోయినట్లు అయ్యిందని, ఇకపై కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కావడం లేదని వాపోయారు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని దీనంగా వేడుకున్నారు.

బడ్జెట్ సరే.. రైలెక్కడా..

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం

నవతెలంగాణ-మెదక్



వికాసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ అమృత్ భారత్ స్టేషన్‌గా నిధులు కేటాయిస్తూ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా అమృత్ భారత్ ప్రారంభోత్సవంలో భాగంగా వికాసిత భారత్ రైల్వే స్టేషన్‌కు నిధులు కేటాయిస్తూ రైల్వే స్టేషన్లను ప్రారంభించారన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు మెరుగుపరచడం వల్ల వ్యవసాయం, పారిశ్రామిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రయాణకులకు మెదక్ రైల్వే స్టేషన్‌లో 15.31 కోట్లతో చేపట్టే మౌలిక వసతుల పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారని, కానీ మెదక్ నుంచి హైదరాబాద్‌కు ఎక్కువగా రైళ్లు నడవడం లేదన్నారు. దీంతో జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు రైలు ఎక్కితే ఎప్పుడో మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ చేరాల్సి వస్తుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ఎక్కితే రాత్రి 11 గంటలకు హైదరాబాద్‌కు చేరాల్సి వస్తుందన్నారు. రైలులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా రైల్వేస్టేషన్లకు ఖర్చు పెట్టే విధంగా చూడాలన్నారు. జిల్లాలో రైళ్ల రాకపోకలను పెంచాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలవకుండా మౌలిక వసతులు కల్పించే విధంగా చూడాలన్నారు. లేనిపక్షంలో పార్టీ అధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. బసవరాజు, కె. మల్లేశం, కె. నర్సమ్మ కార్యవర్గ సభ్యులు కదారి నాగరాజు, సంతోష్, సర్దార్, డి మల్లేశం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- అమలులో నిమిషం నిబంధన
- జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నవతెలంగాణ-మెదక్



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 28 బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 16 వరకు జరుగనున్న పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. నిమిషం నిబంధన ఈ సారి అమలులో ఉంటుండగా గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్లను నెట్ నుంచి తీసుకోవచ్చని అధికారులు సూచించారు. మెదక్ జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, జనరల్ విభాగంలో 13,172 విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 656 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 16 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. నిమిషం నిబంధన ఈసారి అమలులో ఉంటుండగా, విద్యార్థులు 8 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని హై పవర్ కమిటీతో పాటు జిల్లా పర్యవేక్షణ కమిటీ ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను పరీక్షల పర్యవేక్షనకు ఏర్పాటుచేశారు.

గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి. ఎలక్ట్రానిక్ చేతి గడియారాలు, మొబైల్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్స్ జారీ చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను నెట్ సెంటర్ నుంచి పొందవచ్చు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే హెల్ప్ లైన్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9603615652 /76710333232 సంప్రదించాలి. ఇంటర్ పరీక్షలలో ఒత్తిడిని ఎదుర్కోవడానికి టెలి మానస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 14416 / 180091441655 కి కాల్ చేసి మానసిక నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ పొందవచ్చు.



సత్యనారాయణ, ఇంటర్మీడియట్ విద్యాధికారి, మెదక్

కేసీఆర్ కుటుంబాన్ని భూస్థాపితం చేయడమే లక్ష్యం

- పది సంవత్సరాలలో చేసినవన్ని బయటపెడతాం
- కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుంది
- బీఆర్ఎస్ పార్టీని నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యం
- మాజీ ఎమెల్యే మైనంపల్లి హన్మంతరావ్

నవతెలంగాణ-మనోహరాబాద్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గజ్వెల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మనోహరాబాద్ మండలంలోని పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎంపీటీసి, ఉపసర్పంచ్‌లు నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హజరై పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని గత పది సంవత్సరాలలో కేసీఆర్ చేసిన అరాచకాలను బయటపెట్టి, దాని రిజల్ట్ చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్ పేర్కొన్నారు. తూప్రాన్ ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసి ర్యాకల కృష్ణాగౌడ్‌లు తన అనుచరులు సుమారు వంద మంది గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మనోహరాబాద్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని పార్టీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని వారు పార్టీలో చేరడం చాలా శుభపరిణామమని వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మా గమ్యం ఒక్కటేనని కేసీఆర్ కుటుంబం భూస్థాపితం కావడమేనని ఆదే ఆకాంక్షతో పనిచేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేయడమే తమ లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. కేసీఆర్ కుటుంబం గత పది సంవత్సరాలలో చేసిన అరాచకాలను బయటకు తీసి తగిన రిజల్ట్‌ను చూపించే బాధ్యత మాదేనన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీహరిగౌడ్, నవీన్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, నాయకులు మన్నె ధర్మేందర్, జావీద్ పాషా, లక్ష్మారెడ్డి, కావేరిగారి భగవాన్‌రెడ్డి, రంగు గణేష్‌గౌడ్, మల్లారెడ్డి, సంతోష్, రాగం శ్రీనివాస్, పంపరి నాగేష్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరమని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం ఆర్థిక అక్షరాస్య వారోత్సవాల్లో భాగంగా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో 2కే పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకోవడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక డిజిటల్ లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహ మూర్తి, జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధవర్యంలో పూజారి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు హాజరయ్యారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఒడి బియ్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణోత్సవంలో స్థానిక జెడ్పీటీసీ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, బీఆర్ఎస్ నాయకులతో పాటు పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంతటి బ్రహ్మాండమైన ఆలయం నిర్మించినందుకు, అంగరంగ వైభవంగా అమ్మవారి కళ్యాణం నిర్వహించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారు ప్రజను చల్లగా చూడాలని కోరారు. వారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో పూల దండలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పృథ్వీరాజ్ గౌడ్, రాజా గౌడ్, శంకర్ గౌడ్, మల్లేశం గౌడ్, స్వామి గౌడ్, సిద్దా గౌడ్‌లతో పాటు భక్తులు భారీగా పాల్గొన్నారు.

మెదక్‌లో బీజేపీ విజయసంకల్పయాత్ర

నవతెలంగాణ-మెదక్ టౌన్



మోడీని మళ్లీ ప్రధాని చేయడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర చేస్తున్నామని రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర మెదక్ పట్టణంలోని రాం దాస్ చౌరస్తా జరిగిన సభలో వారు మాట్లాడారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాలను గెలిచి పార్లమెంటు లో అడుగు పెడతామన్నారు. తెలంగాణలో ఇచ్చిన ఆరోగ్య శ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ ఆయుష్మాన్ భారత్ కింద రూ 10 లక్షలు ఇస్తున్నారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం కాకముందు బెల్ట్ షాపులు మూసేస్తానని మోసం చేశారని ఆరోపించారు. ఆరోగ్యం బాగా లేకపోతే ట్యాబ్‌లెట్ దొరకడం లేదు కానీ మద్యం దొరుకుతుందన్నారు. మహిళల కోసం వెంటనే బెల్ట్ షాపులు మూసేయాలని డిమాండ్ చేశారు. నంబర్ వన్ అన్న సీఎం కేసీఆర్ లక్ష రుణమాఫీ చేయకుండా బోల్తా పడ్డారన్నారు. ప్రజలు గోల్ మాల్ కారు, కాంగ్రెస్‌ను గోల్ మాల్ చేస్తారని తెలిపారు. ప్రపంచంలో మొట్టమొదటిగా కరోనా వ్యాక్సిన్ వచ్చింది మోడీ వల్ల అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, వీణ, గడ్డం శ్రీనివాస్, పంజా విజయ్ కుమార్, నందా రెడ్డి, ఎం ఎల్ ఎన్ రెడ్డి, సత్యనారాయణ, ఎక్కలదేవ్ మధు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఎంపిడిఓకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-నార్సింగి





బదిలీ పై వెళుతున్న ఎంపిడిఓ ఆనంద మేరీకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి చిందం సబిత రవీందర్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా నార్సింగి మండల ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన ఆనంద మేరీ సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం నార్సింగి మండలానికి ఇంచార్జీ ఎంపిడిఓగా చిన్నా రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆనంద మేరీ వీడ్కోలు సమావేశంలో మండల పరిధిలోని తొమ్మిది గ్రామ పంచాయితీల పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిపి, వైస్ ఎంపిపి, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొని ఆనంద మేరీని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనంద మేరీ అన్ని వేళలా తమకు సహాయ సహకారాలు అందించారన్నారు. ఆమె ఎక్కడ ఉన్నా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఆనంద మేరీ మాట్లాడుతూ తన వీధి నిర్వహణ లో ఎవ్వరు మనసునైనా నొప్పిస్తే మన్నించాలని కోరారు. తనకు మండల వ్యాప్త తొమ్మిది గ్రామాల నుంచి నవరత్నాల లాంటి కార్యదర్శులు, సర్పంచులు లభించారన్నారు. ఉద్యోగంలో బదిలీ సహజం అని, బాధా తప్త హృదయంతో మండలం నుంచి వీడ్కోలు తీసు కుంటున్నానన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-తొగుట



విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయులు పి.రామ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద మసాన్ పల్లి మధిర గ్రామంలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఇందులో ఎంఈఓ గా బి. నీరజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులుగా దీపక్, శైలజ విధులు నిర్వహించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సీఆర్పీ బాలకష్ణ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవ తెలంగాణ - సిద్దిపేట



టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ కో కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి అధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణిని మంగళవారం కలిసి శాలువాతో సన్మానం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోను మున్సిపల్ కమిషనర్‌కి అందచేశారు. ఆమెను కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి దాస అంజయ్య, అర్బన్ మండల అధ్యక్షులు కలిమి బిక్షపతి, నాయకులు పిడిశెట్టి నర్సింలు, ఐరెని లింగం, బాలకృష్ణ, శేఖర్, మోహన్ రెడ్డి, మల్లేశం, తదితరులు ఉన్నారు.

వాగ్దేవి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ, ఏఐపీఎస్(యూ)




నవతెలంగాణ -దుబ్బాక

విద్యార్థుల నుంచి ఫీజులు గుంజడమే లక్ష్యంగా పరీక్షల సమయంలో హాల్ టికెట్లను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న వాగ్దేవి జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐపీఎస్(యూ) రాష్ట్ర అధ్యక్షులు మన్నె కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని వాగ్దేవి కళాశాల ఎదుట సంఘాల నాయకులు బాధిత విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నందున ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి హాల్ టికెట్లను అందజేయాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్దయగా, దురుసుగా ప్రవర్తిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డిపై చర్యలు తీసుకొని కాలేజీని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ సాధిక్, ఏఐపీఎస్(యూ) నాయకులు బొల్లు నగేష్, రవికుమార్, స్వామి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవ తెలంగాణ-కొండపాక



కుకునూరు పల్లి మండలం లకుడారం శివారులో చెట్టుకు వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల జిల్లా సారంపల్లి గ్రామానికి చెందిన బొప్పెన పరశు రాములు(30) చిట్టీలు నిర్వహిస్తుండగా అప్పుల పాలయ్యాడు. దాంతో ఆయన కలత చెంది తిరుపతికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. తిరిగి వస్తుండగా హైదరాబాద్ శివారులో ఆత్మహత్యకు పాల్పడుతుండగా చూసిన స్థానికులు ఆయన్ని అడ్డుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దాంతో అక్కడున్న వారితో ఇంటికి వెళ్తానని చెప్పి.. మార్గమధ్యలో లకుడారం శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవ తెలంగాణ- కొండపాక

కొండపాక మండలం దుద్దెడ, మర్పడగ గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుద్దెడ, మర్పడగ గ్రామాలకు చెందిన ఆరేపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు యాదగిరి, ఎల్లాగౌడ్, కొంక ప్రభాకర్, దోమల కనకయ్య, బూర్గుల నాగరాజు, ఆరేపల్లి ప్రశాంత్, యాదగిరి, చరణ్, మహేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. పార్టీలో అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని, అందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షులు వాసరి లింగారావు, నాయకులు సుదర్శన్, దుద్దెడ గ్రామ అధ్యక్షులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కాశీ లింగేశ్వర స్వామి ఆలయ మహోత్సవాలు

ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు
వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో కాశీ లింగేశ్వర స్వామి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించే ప్రతిమలకు ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో సుమారు 30 దంపతుల జంటలు పాల్గొన్నారు. అనంతరం సుమారు 42 ఫీట్ల ఎత్తుతో ఏర్పాటుచేసిన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవంతో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

9వ వార్డులో పారిశుద్ధ్య పనులు



నవతెలంగాణ- దుబ్బాక

పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో మంగళవారం పారిశుద్ధ్య పనులను చేపట్టినట్టు వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛ దుబ్బాకలో భాగంగా తమ వార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వార్డులోని పలు వీధుల్లో దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వా ఆయిల్ స్ప్రే చేయించామని చెప్పారు. ఇంట్లో పేరుకుపోయిన చెత్తను చెత్త సేకరణ వాహనానికి మాత్రమే అందించాలని, ఆరుబయట మురికి కాలువల్లో చెత్తను పడేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

త్రిబుల్ ఆర్ మరింత ముందుకు

- గజ్వేల్ నియోజకవర్గం చుట్టూ రింగు రోడ్డు
- త్వరలో త్రీజీ నోటిఫికేషన్

నవతెలంగాణ- గజ్వేల్

త్రిబుల్ ఆర్ కోసం భూముల సేకరణపై సంబంధిత అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్ ఉండగా, ఐదు మండలాల్లో త్రిబుల్ ఆర్ రావడంతో ఇక్కడ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. 980 ఎకరాల భూసేకరణ చేసినందుకు అధికారులు రైతుల వద్దకు వెళ్లి పరిహారం విషయంలో చర్చిస్తున్నారు. రైతులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. భూ నిర్వాసితులకు పరిహారం పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. దాంతో గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) భూసేకరణకు సంబంధించిన త్రీజీ నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్నారు. భూముల స్వాధీనానికి సంబంధించి ఇది తుది నోటిఫికేషన్‌గా చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సంబంధిత అధికారులు దాదాపు పూర్తి చేశారు. ఇప్పటికే యాదాద్రి-భువనగిరికి సంబంధించిన త్రీజీ నోటిఫికేషన్ పూర్తికావడంతో ఇక గజ్వేల్ డివిజన్‌పై దృష్టి సారించారు. దీంతో ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనుల్లో కీలక ముందడుగు పడినట్లయింది.

రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ డివిజన్ల వారీగా పూర్తి చేయడానికి నేషనల్ హైవే



అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఎఐ) అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగంలో ఈ రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు కాగా ఇందులో వంద కిలో మీటర్లకుపైగా ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనున్నది. భూసేకరణను సులభతరం చేయడానికి రెవెన్యూ డివిజన్ల వారీగా (కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ ఆక్విజేషన్) ఏర్పాటు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ఐదు మండలాల్లో 54కిపైగా గ్రామాల్లో 4,500 ఎకరాల వరకు భూసేకరణ జరగనున్నది. ఇది కాకుండా.. ఈ నెల 14న యాదాద్రి-భువనగిరి జిల్లాలో 460 ఎకరాల భూసేకరణ కోసం త్రీజీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన అధికారులు.. ఇక



గజ్వేల్ ఇలాకాపై దృష్టి సారించారు. గజ్వేల్ రెవెన్యూ పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుండగా, జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజపేట, మర్కూక్ మండలంలోని అంగడికి షాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలంలోని ప్రజ్ఞాపూర్, ముట్రాజ్పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లా వెంకటాపూర్, వర్గల్ మండలంలోని మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలంలోని బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో మొత్తంగా 980 ఎకరాల భూసేకరణ జరగనుంది. ఉత్తర భాగం పరిధిలో అత్యధికంగా ఇక్కడే భూసేకరణ జరగనున్నది. త్రిబుల్ ఆర్ నోటిఫికేషన్ తర్వాత అధికారులు భూములు కోల్పోతున్న రైతుల వద్ద నుంచి పరిహారాల పంపిణీకి సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించడం, నోటీసులు ఇవ్వడం, పరిహారం తేల్చి రైతులకు తెలియజేయడం వంటి పనులు ఊపందుకోనున్నాయి. అధికారులు ఇక క్షేత్రస్థాయిలో కార్యాచరణను ముమ్మరం చేయనున్నారు.

మంత్రి పొన్నంపై ఎంపీ బండి వ్యాఖ్యలపై కాంగ్రెస్ కన్నెర్ర



నవతెలంగాణ-బెజ్జంకి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంకాల ప్రవీణ్ అధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. అనంతరం ఎంపీ బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షులు కర్రావుల శంకర్, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు రొడ్డ మల్లేశం, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మచ్చ కుమార్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అమరగొండ రాజు, రంజిత్, నాయకులు శానగొండ శరత్, చెలుకల నరేందర్ రెడ్డి, బొనగం రాజేశం, తిరుపతి రెడ్డి, ఇస్కిల్ల ఐలయ్య, తిప్పారపు మల్లేశం, బొనగం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలను కించపరడం.. హిందుత్వాన్ని కించపరచడమే..

హిందుత్వ ముసుగులో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో మంత్రి పొన్నం తల్లిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం హిందుత్వాన్ని కించపరచడమేనని మండల కాంగ్రెస్ నాయకులు మెట్ట నాగరాజు అన్నారు. బీసీ కులగణనకు అసెంబ్లీలో శ్రీకారం చుట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీ బండి ముమ్మాటికి బీసీ ద్రోహియేనని.. రాబోయే ఎన్నికల్లో బీసీ సామాజిక తరగతి ప్రజలు ఎంపీ బండికి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు.

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలో మంగళవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్



పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ యాత్రను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓ బీసీ మంత్రిపై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు తప్పెట శంకర్, జంగిటి శ్రీనివాస్, రాగుల క్రిష్ణ, అచ్చిన సత్తయ్య, గౌరబోయిన సంపత్, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలు, చేతబడి బూటకమే

ఎస్ఎస్ఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేశ్
కేజీబీవీ విద్యార్థినీలకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-బెజ్జంకి

దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమని.. సైన్స్‌తో విద్యార్థులు సైనికులుగా ముందుకు నడవాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) జాతీయ కమిటీ నాయకులు ఉప్పులేటి నరేశ్ తెలిపారు. సీపీ అనురాధ ఆదేశాల మేరకు బెజ్జంకి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయ విద్యార్థినీలకు 'వ్యక్తిత్వ వికాసం- మూఢనమ్మకాల నిర్మూలన'పై ఉప్పులేటి నరేశ్ మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో నేటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు మూఢనమ్మకాలపై విశ్వాసం చూపడం దురదృష్టకరమన్నారు. శాస్త్రీయ ఆలోచనలతో ఆవిష్కరణలు సాధ్యమన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. దొంగ స్వాములు, భూత



వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారని తెలిపారు. సైన్స్ మ్యాజిక్ షో ద్వారా ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచీని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం వంటి ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ రావు, ప్రధానోపాధ్యాయురాలు శ్వేత, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నవీన్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మాజీచైర్మెన్ భాస్కర్‌ను పరామర్శించిన చైర్మెన్ రాజమౌళి



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కేర్ హాస్పి టల్ చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కాగా, మంగళవారం ప్రస్తుత మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి గుప్త ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజమౌళి.. భాస్కర్ యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వారి వెంట కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, పంబాల అర్చన శివకుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..
నిమిషం ఆలస్యమైనా ప్రవేశం లేదు
మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

నవతెలంగాణ-బెజ్జంకి

నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు మండలంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. నేటి నుంచి మార్చి 16 వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 356 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నట్టు పరీక్షల నిర్వహణ అధికారి ధనరాజ్, డీఓ వెంకట కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి సంవత్సరంలో 190 మంది, రెండవ సంవత్సరంలో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు సిట్టింగ్ స్కార్డ్ పర్యవేక్షిస్తారన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి ప్రవేశం లేదని తెలిపారు. ఉదయం 8.15 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే ప్రభుత్వం చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.





నవ తెలంగాణ -గజ్వేల్

నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు సిద్దిపేట జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల షెడ్యూల్ నాటి నుంచే ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో విద్యార్థులను అప్రమత్తం చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సిద్ధం చేశారు. కాగా, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం 20,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ప్రథమ సంవత్సరంలో 9831 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 11,118 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల పర్యవేక్షణకు 12 మంది సూపరింటెండెంట్లు, 44 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 1047 మంది వరకు ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించమని అధికారులు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.

ఎస్ఐని కలసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ నూతన ఎస్ఐగా చల్ల మధుకర్ రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మంగళవారం మండలంలోని గంగా పూర్-యూసుఫ్ ఖాన్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ గడ్డం ప్రసాద్, ఉప సర్పంచ్ జగదీష్ సింగ్.. అయన్ని మర్యాద పూర్వకంగా కలసి పూలగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

ఇంటర్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

-ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మహమ్మద్ సుల్తానా ఉమర్

నవ తెలంగాణ- రాయపోల్



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మహమ్మద్ సుల్తానా ఉమర్.. ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. ఏడాదంతా కష్టపడి చదివిన సబ్జెక్టులను ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానన్నారు. తల్లిదండ్రులకు, గ్రామానికి, మీరు చదివిన కళాశాలకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

నవ తెలంగాణ- గజ్వేల్ : పోలియో నివారణ కోసం మార్చి 3వ తేదీ నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంత చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా॥ రాహుల్ కుమార్, డా॥బల్బీర్ సింగ్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో పల్స్ పోలియో కార్యక్రమంపై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5 ఏండ్లలోపు పిల్లలు 4200 మందిని గుర్తించినట్టు చెప్పారు. అప్పుడే జన్మించిన చిన్నారి మొదలుకొని ఐదేండ్ల చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందించేందుకు 31 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, 130 మంది సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంచార జాతుల చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ఒక మొబైల్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పల్స్‌పోలియో కార్యక్రమంలో మొదటి రోజు కేంద్రాల వద్దనే పోలియో చుక్కలు అందరికీ అందేలా చూడాలని సూచించారు. ఇద్దరు వైద్యాధికారులు, నలుగురు సూపర్ వైజర్ల పర్యవేక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైపాల్ రెడ్డి, డా॥ప్రణయ్ రాజ్, సీడీపీవో వెంకట్రాజమ్మ, ఎంఈవో సీహెచ్‌ఓ ఖాసీం, హెచ్ఈవో సత్యనారాయణ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం చేయడం బాధాకరం

నవ తెలంగాణ- గజ్వేల్



సిద్దిపేట మండలం బక్రిచెప్యాల గ్రామంలో ఆదివారం రాత్రి మహాత్మా గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడం బాధాకరం అని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిని నర్సింహులు అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వెంటనే అరెస్టుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జాతిపితగా గుర్తింపు పొందిన మహాత్మాగాంధీ శాంతి మార్గంలో ఈ దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చారని వారిని ఆదర్శంగా తీసుకొని ఎన్నో దేశాల్లో చాలామంది నాయకులు వారి హక్కులను సాధించుకున్నారని గుర్తుచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 28 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కేపీఆర్





నవతెలంగాణ-తొగుట

మాజీ సర్పంచ్‌ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం మండలం లోని గోవర్ధనగిరి తాజా మాజీ సర్పంచ్ తోయేటి ఎల్లంను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. తోయేటి ఎల్లం మాతృమూర్తి రోశమ్మ సోమవారం మరణించారు. విషయం తెలు సుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సర్పంచ్‌ను ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. అంతకుముందు రోశమ్మ చిత్ర పటానికి నివాళి అర్పించి, ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడి పల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు దోమల కొమురయ్య, చిలువేరి మల్లా రెడ్డి, బక్క కనకయ్య, ఎం. చంద్రారెడ్డి, సుతారి రమేష్, పాత్కుల వెంకటేశం, దుబ్బాక కనకయ్య, నంట పరమేశ్వర్ రెడ్డి, పరమేష్, మంతూరి రమేష్ తదితరులు ఉన్నారు.

రైతు వేదికను సందర్శించిన ఏడీపీ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం రైతు వేదిక యందు దొంగలు చొర బడి భీభత్సం సృష్టించిన ఘటనపై మంగళవారం హుస్నాబాద్ ఏడీపీ మహేశ్ సందర్శించి పరిశీలించారు. పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టినట్టు ఏఈఓ రేణుకాశ్రీ తెలిపారు.

బండి క్షమాపణ చెప్పాల్సిందే

- ప్రజాహిత యాత్రను అడ్డుకుంటాం.
- కాంగ్రెస్ నాయకుల నిరసన
- హుస్నాబాద్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హుస్నాబాద్ ఎమ్మెల్యే రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ, ఆ వ్యాఖ్యలపై బండి సంజయ్ బే షరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే ప్రజాహిత యాత్రలు అడ్డుకుంటామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి మీదుగా హుస్నాబాద్‌కు చేరుకొనున్న ప్రజాహిత యాత్రలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని వెళ్లి కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్ పై కేసు నమోదు చేయాలని, మంత్రి తల్లికి క్షమాపణ చెప్పిన తర్వాతనే తన ప్రజాహిత యాత్రను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి మాటలు మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకుందామని చూసే బండి సంజయ్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.



హుస్నాబాద్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు ఉరితీసి హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దదహనం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్ పద్మ, అక్కు శ్రీనివాస్, బూరుగు కిష్ట స్వామి, వెన్నె రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ సోమవారం చిగురుమామిడి మండలంలో రాష్ట్ర ఉద్యమకారుడు, మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులపై అనుచిత వాఖ్యలు చేయడం పట్ల బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. అలాగే ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేనట్లయితే ప్రజాహిత యాత్రను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటారని హెచ్చరించారు. అక్రమ సంపాదనతో, అధికారం ఉందనే అహంతో ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బీంరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు ముంజ తిరుపతి, బోయిని జయరాజ్, రజమల్లారెడ్డి, చుక్క అశోక్, చుక్క శంకర్, బైరి సుధాకర్, ముంజ శ్రీనివాస్, గోవిందు రమేష్, యూత్ ఉపాధ్యక్షులు రాచూరి శ్రీనివాస్, పిడిశెట్టి సాయి, దినేష్, పద్మారెడ్డి, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన నర్సారెడ్డి



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని, నర్సాపూర్, కొక్కొండ, కోతుర్, గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తున్నదని మరో రెండు హామీలను కూడా అమలు చేయడంలో ముందడుగు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు గత ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే పేద ప్రజలు ఆనందంగా ఉంటారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా తమల శ్రీనివాస్ బూరం గణేష్ యాదవ్ మల్లేష్ యాదవ్ కరుణాకర్ గౌడ్ పాల్గొన్నారు

కాలనీకి వాటర్ ప్లాంట్‌ను అందజేసిన కోకో కోలా కంపెనీ



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి మినరల్ వాటర్ ప్లాంట్‌ను కోకో కోలా కంపెనీ వాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోకోకోలా కంపెనీ మేనేజర్ మాజీ సర్పంచ్ బాల మల్లేష్ బోరం గణేష్ యాదవ్ సెక్రటరీ తిరుపతి అంబేద్కర్ ప్రెసిడెంట్ ఎర్ర వీరేష్, కృష్ణ, శివకుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు అంబేద్కర్ ప్రెసిడెంట్ ఎర్రవీరేష్ మాట్లాడుతూ మా ఎస్సీ కాలనీకి వాటర్ ప్లాంట్ ను డొనేట్ చేసిన కోకోకోలా కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో టూ కే వాకథాన్



నవతెలంగాణ-సిద్దిపేట

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం సిద్దిపేట కోమటి చెరువులోని రూబీ నెక్లెస్ రోడ్ నందు 2కే వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు చైర్మన్ సత్యజిత్, యూనియన్ బ్యాంక్ రీజియన్ చైర్మన్ వికాస్ మాట్లాడుతూ సేవింగ్స్ మరియు పవర్ ఆఫ్ కంపౌండిగ్, బ్యాంకింగ్ అవసరాలు, డిజిటల్ మరియు సైబర్ హైజీన్ అనే అంశాల పట్ల అవగాహణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, బ్యాంకు అధికారులు రాఘవ, సిబ్బంది, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయన్స్ ఆధ్వర్యంలో అవార్డుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వనమాలి విజయోత్సవం కార్యక్రమం సందర్భంగా డిస్టిక్ కన్వెన్షన్ అవార్డుల కార్యక్రమం జిల్లా గవర్నర్ సోమ వనజ ఆధ్వర్యంలోని దేవి గార్డెన్ లో ఘనంగా జరిగింది. క్లబ్ సభ్యులు చేసిన సేవలను గుర్తించి పిఎస్టి అవార్డ్స్, జోన్ ఆర్సి అవార్డ్స్, డిస్టిక్ బాడీ అవార్డ్స్, పిడిజి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ గా ఇంటర్నేషనల్ అధికారులు మోహన్ రావు, స్పెషల్ గెస్ట్ గా డి బాలగంగాధర్ శాస్త్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆత్మ రాములు, వైకుంఠము, అంజయ్య, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

చేతిరాత మార్చండి... మీ జీవితాన్ని మార్చుకోండి



నవతెలంగాణ-మర్కుక్

విద్యార్థులు చిన్నతనం నుంచి తమ చేతిరాతపైన ఏకాగ్రత ఉంచాలని, అమూల్యమైన వ్యక్తితో వికాసం, లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తిలో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందరూ కూడా తెలుగు, హిందీ, ఆంగ్లం త్రి భాషల్లో కూడా అందమైన చేతిరాతను మార్చుకొని కేవలం 30 రోజుల్లో ఈ అద్భుతాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. సుమారు 250 మంది విద్యార్థులకు నిర్వహించిన వర్క్ షాప్ లో విద్యార్థులకు కావలసిన చేతిరాత సామగ్రిని అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు కూడా 10 జీపీఎ సాధించడానికి చేతిరాత తప్పకుండా దోహదం చేస్తుందన్నారు. అద్యంతం ఉల్లాసంగా సాగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీ సైదా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

మహిళా సంఘాల అభ్యున్నతి కోసం కృషి

- ఏపీఎం కృష్ణారెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎం కృష్ణారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని మహిళా సంఘాల సభ్యులు చేవెళ్లలో సీఎంతో జరిగే ముఖాముఖి కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంతో పాటు మహిళా సంఘాల సభ్యుల సమస్యల పరిష్కారం కోసం ఫేస్ టు ఫేస్ మాట్లాడుతానని సీఎం తెలపడం ఆనందంగా ఉందన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్‌తో పాటు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందించడం హర్షణీయమన్నారు. సీసీలు భాస్కర్, అక్బర్, వైకుంఠం, బాల్ రాజు విఓఎ యమున. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వంటిమామిడి మార్కెట్ కమిటీ పీఠం ఎక్కేదెవరు

- ముంపు గ్రామస్తులకు మార్కెట్ కమిటీ పీఠం దక్కేనా

నవతెలంగాణ-ములుగు



వంటిమామిడి మార్కెట్ కమిటీ పీఠం ఎవరికి దక్కుతుందని ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో మార్కెట్ కమిటీలో కొలువు తీరిన నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోవడంతో మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అనంతరం కొత్త ప్రభుత్వం మార్కెట్ కమిటీని నియమించడానికి కసరత్తు ప్రారంభించింది. అయితే వంటిమామిడి మార్కెట్ కమిటీ ఎస్సీ మహిళా రావడంతో ములుగు మండలం నుంచి కాకుండా నియోజకవర్గంలో నుంచి మార్కెట్ కమిటీ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. కానీ గత బీఆర్ఎస్ పభుత్వంలో పనిచేసిన వారిలో మొదటి ప్రాధాన్యత ముంపు గ్రామస్తులకు ఇచ్చి మామిడాలకు చెందిన కోడూరు భూపాల్ రెడ్డికి వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం పార్టీ కోసం పనిచేసిన ముంపు గ్రామస్తులకు అధికారం కట్టబెడుతుందా అనే కోణంలో ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వం కొరకు పనిచేసిన వారిని గుర్తించడంలో నాయకులు సఫలమయ్యారు. ఈ ప్రభుత్వం ముంపు గ్రామస్తులను తుంగలో తొక్కుతుందా అధికారం ఇస్తుందా అనేది వేచి చూడాల్సిందే.

దుబ్బాకను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఈ బడ్జెట్ సంవత్సరంలోగా పూర్తిచేసేందుకు కృషి చేస్తామన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి అధ్యక్షతన జరిగిన 2024-25 వార్షిక బడ్జెట్ (రూ.19 కోట్ల 40 లక్షల ఆదాయం, రూ.19 కోట్ల 39 లక్షల వ్యయం, రూ.1 లక్షా 5 వేలు మిగులు) సమావేశంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దుబ్బాక నుండి హబ్సీపూర్ వరకు నాలుగు లైన్ల రహదారి, చుట్టూ రింగ్‌రోడ్ ఆడిటోరియం, అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు, దుబ్బాక చుట్టూరా ఉన్న చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, స్మశాన వాటికల్ని పూర్తి చేయడం, పలు కుల సంఘాల భవనాల నిర్మాణం వంటి తీర్మానాలను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్, ఏఈ యాదగిరి, వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ సర్కార్‌కు అండగా నిలబడాలి



నవతెలంగాణ-దుబ్బాక

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ సర్కార్‌కు అండగా నిలబడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ సర్కారు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్, హబ్సీపూర్, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్, పోతారెడ్డిపేట గ్రామాల్లో బీజేపీ విజయసంకల్ప యాత్రను నిర్వహించారు. 10 ఏండ్లుగా మోడీ సర్కారు చేపట్టిన అభివృ ద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి,పలువురు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



నవతెలంగాణ- గజ్వేల్

పోలియో నివారణ కోసం మార్చి మూడవ తేది నుండి పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా'. రాహుల్ కుమార్, డా. బల్బీర్ సింగ్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో పల్స్‌పోలియో కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4200 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలను(చిన్నారులను) గుర్తించినట్లు చెప్పారు. అప్పుడే జన్మించిన చిన్నారి మొదలుకొని ఐదు సంవత్సరాల చిన్నారులు(పిల్లలు) అందరికీ పోలియో చుక్కలు అందించుటకు మూడు రూట్లుగా విభజించి 31 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో, నివాసప్రాంతాల్లోని చిన్నారులు అందరికి పోలియో చుక్కలు అందించుటకు 130 సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంచార జాతుల చిన్నారులకు ఫోలియో చుక్కలు అందించుటకు ఒక మొబైల్ టీం ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుంది అని చెప్పారు. మొదటి రోజు పోలియో కేంద్రాల వద్దనే చిన్నారులు అందరికీ పోలీయో చుక్కలు అందేలా చూడాలని చెప్పారు. ఇద్దరు వైద్యాధికారులు, నలుగురు సూపర్ వైజర్ల పర్యవేక్షణలో పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులు సహకరించి కార్యక్రమమును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డివోజైపాల్‌రెడ్డి, డా. ప్రనయ్‌రాజ్. , సిడి పివో.వెంకట్రాజమ్మ, ఎం.ఇ.వో సిహెచ్.ఒ.ఖాసీం, హచ్ఇఓ సత్యనారాయణ రెడ్డి , ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ-తొగుట

విద్యార్థులకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారని పరీక్షల చీఫ్ సుపెరింటెండెంట్ రమావత్ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం ఇంటర్ పరీక్షల నిర్వహణ గురించి ప్రభుత్వ జూనియర్ కళాశాల తొగుట రాంపూర్‌లో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇంటర్ మొదటి సంవత్సరం 187 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని అన్నారు. పరీక్ష నిర్వహణ పట్ల తీసుకోవాలని జాగ్రత్తలు, ఇన్విజిలేటర్లకు సూచనలను చేసినట్లు తెలిపారు. నిమి షం ఆలస్యమైనా అనుమతి లేదని ఈ విషయం లో విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

ఎంపీ అనని మాటను అన్నట్లుగా వక్రీకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం



నవతెలంగాణ-కోహెడ

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ సోమవారం చిగురుమామిడి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎలాంటి మాటలు అనలేదని కాంగ్రెస్ నాయకులు కావాలనే వక్రీకరిస్తున్నారని బిజెపీ పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి వక్రీకరణలతో మంత్రి గౌరవం తగ్గుతుందని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలన్నారు. దిష్టిబొమ్మను దహనం చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, పిల్లి నర్సయ్యగౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మామిడి కరుణాకర్‌గౌడ్, కంది సత్యనారాయణరెడ్డి, రామంచ రాంచంద్రరెడ్డి, కక్కర్ల దామోదర్‌గౌడ్, సామల గిరిధర్, వేముల రమేష్, గాజుల వేంకటేశ్వర్లు, ఎదులపురం రాజుచారి, సుంకరి రవి, రాగుల రాజుయాదవ్, సానాది చంద్రం, పొన్నాల సాగర్, దానవేని రమేష్, గుంటి బాలయ్య కొనవేని రవి, పొన్నాల బాబు, పెందోట భూశంకరాచారి, తదితరులున్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి

- డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్



నవతెలంగాణ-మిరు దొడ్డి

దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో,హాస్టల్స్ లలో విద్యార్థులకు భారత రాజ్యాంగం గణతంత్ర దినోత్సవం పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. .ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ మంగళవారం మాట్లడుతూ జనవరి లో మిరుదొడ్డి లో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వ్యాస రచన పోటీ నిర్వహించడం జరిగిందన్నారు.వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ,ద్వితీయ,తతీయ బహుమతులు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

స.హ.చ పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన ఏటి ఆంజనేయులును సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ వాట్సాప్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఏటి ఆంజనేయులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ప్రతి పౌరునికి భారత్ వంటి అనేక ప్రజాస్వామ్య దేశాలలో సమాచార హక్కు ప్రాథమిక హక్కులలో భాగంగా అత్యంత విలువైన మానవ హక్కుగా గుర్తించారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పథకాల గురించి అవగాహన పెంచుకోవడానికి కూడా సమాచార హక్కు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని శక్తివంతమైన సాధనంగా ఉపయోగించాలని అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందన్నారు. తనకు ఇంతటి బాధ్యత ఇచ్చినటువంటి జాతీయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శంకర్‌కు డాక్టరేట్ అందజేత



నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఓరియంటల్ తెలుగు విభాగం డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది. డాక్టర్ పదాల జగన్నాథరావు పర్యవేక్షణలో "తెలంగాణ నవల సాహిత్యంలో మహిళల జీవన చిత్రణ" అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. డాక్టర్ బి.రాజరత్నం, ప్రొఫెసర్ సి.కాసిం, డాక్టర్ సిల్మానాయక్, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, డాక్టర్ జగన్నాధరావు, డాక్టర్ బండారి ప్రేమ్‌కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉస్మానియా విద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. తన పరిశోధనకు సహకరించిన పర్యవేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూమి సమస్యలు పరిష్కరించాలి

- గూడెం దళితుల ఆందోళన



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

భూమి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా సమీకత కలెక్టర్ కార్యాలయం ముందు గూడెం దళితులు మంగళవారం ధర్నా చేశారు. బెజ్జంకి మండలంలోని గూడెం గ్రామానికి చెందిన దళితులు గత ప్రభుత్వము భూమిలేని దళితుల కొరకు 2017లో తల్లిపెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 60 ఎకరాల 17 గుంటల భూమిని కొనుగోలు చేసింది. గూడెం గ్రామంలో ఎలాంటి సభ నిర్వహించకుండా 34 కుటుంబాలను ఎంపిక చేశారు, మిగతా దళితులకు భూమి రాకపోవడంతో లబ్ధిదారుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని మరణించారు. మరి అప్పటి ప్రభుత్వం భూమి ఉన్నవారికి వారు అనుకున్న వారికి రైతు పట్టా పాస్ బుక్కులు ఇచ్చినా.. ఇంకా 16 కుటుంబంలో ఉన్న వారికి ఎలాంటి వ్యవసాయ భూమి లేదు అని వారన్నారు. భూమి కొరకు దాదాపు ఐదు సంవత్సరముల నుండి జిల్లా కలెక్టర్ అప్పటి రెవెన్యూ మంత్రికి, మండల తాసిల్దార్‌కి అర్జీలు సమర్పించినా ఎలాంటి స్పందన లేదు అని తెలిపారు .అప్పటి ప్రభుత్వము కొనుగోలు చేసిన భూమిని దానిని మరల ప్రభుత్వం వాపసు తీసుకుని.. దళితులకు గూడెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి భూమిలేని దళిత కుటుంబములకు భూమి మళ్లీ తిరిగి పంచి పట్టాలు ఇవ్వాలని గూడెం గ్రామస్తులు కోరుతున్నారు.